అండగా ఉంటాం...ఆశీర్వదించండి

• ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి అర్బన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా ప్రజలందరికీ అండగా ఉంటామని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రజలను కోరారు. యల్లనూరు రోడ్డులో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలు తీరును అక్కడున్న వలంటీర్ల ద్వారా ఆరా తీశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం వార్డు ప్రజలతో ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో కూడా అందరినీ ఆదుకున్నామన్నారు. సీఎం వైఎస్.జగన్ పాలనలో ప్రతి కుటుంబంలో ఆనందాలు వెల్లివిరిశాయన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు ఇలాగే శాశ్వతంగా ఉండాలంటే తిరిగి వైఎస్ జగన్‌ను సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా తమ ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రజలకందిస్తున్న వైఎస్.జగన్‌కు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే వెంట విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కేశవరెడ్డి, పట్టణాధ్యక్షుడు మనోజ్, నాయకులు సాంబశివారెడ్డి, సాయితేజా రెడ్డి, జేసీ వరదయ్య తదితరులు ఉన్నారు.


సంక్షేమ పథకాల అమలును చదివి వినిపిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి


వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

వైఎస్సార్‌సీపీలో చేరిక

తాడిపత్రిటౌన్: బందర్లపల్లిలో టీడీపీ పార్టీకి చెందిన కృష్ణారెడ్డి, మహేశ్వరెడ్డి కుటుంబంతో పాటు మరో 4 కుటుంబాలు మంగళవారం ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ లో చేరాయి. ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన, ఎమ్మెల్యే పెద్దారెడ్డి తాడిపత్రిలో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరెడ్డి, నాయకులు హనుమంత రెడ్డి, నాగిరెడ్డి, నాగేశ్వరెడ్డి, యగునందన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పుల్లారెడ్డి, మురళీ, ఇగుడూరు రాజు, బాలరాజు తదితరలు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తో భవిష్యత్తుకు భరోసా

తాడిపత్రి అర్బన్: రాష్ట్రాన్ని సంక్షేమ, అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రజల భవిష్యత్తుకు భరోసా అని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 2వ వార్డులో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన స్థానికులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎప్పటికప్పుడు వార్డు వలంటీర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి యోగ క్షేమాలు తెలుసుకుంటున్నారని, ప్రజలు వలంటీర్లకు సహకరించాలని కోరారు. జగనన్న పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మరో రెండు నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయని, ఆ ఎన్నికల్లో సంక్షేమ సారథి వైఎస్.జగన్‌కే తిరిగి పట్టం కట్టాలని యువ నాయకుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి కోరారు. సచివాలయ కార్యదర్శులు, వార్డు వలంటీర్లు, నాయకులు సూర్యప్రభాకర్‌బాబు, అలీ, షావలి, జాకీర్ తదిరులు ఉన్నారు.

యాడికి: మండల కేంద్రంలోని 4వ వార్డులో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన సరోజమ్మకు రూ 1.20 లక్షలు, జక్కన్నకు రూ.9 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. వైస్ ఎంపీపీ చెన్నప్ప, యాడికి ఉప సర్పంచు కాసా చంద్ర మోహన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు, రామ్మోహన్, వార్డు సభ్యులు తిరుపతి, రామచంద్ర, బాలపెద్దయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ శివప్రసాద్ పాల్గొన్నారు.


మహిళతో సమస్యలు తెలుసుకుంటున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

అనంతపురం రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగితేనే చదువులో రాణిస్తారని బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారి సూచించారు. మంగళవారం తాడిపత్రిలోని సిద్దార్థ బీఈడీ కళాశాలలో తాడిపత్రి డివిజన్ పరిధిలోని బీసీ వసతి గృహాల విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారి మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై గౌరవం పెంచుకోవాలన్నారు. ఇష్టపడి చదివితేనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకుంటారన్నారు. తోటి విద్యార్థులతో స్నేహభావంతో మెలగాలన్నారు. పదోతరగతి విద్యార్థులు ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. విద్యార్థులకు వసతి గృహాల్లో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాల్సిన బాధ్యత వార్డన్లపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహాయ సంక్షేమ అధికారి రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న డీడీ కుష్బూ కొఠారి

రేపు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

బుక్కరాయసముద్రం: కొర్రపాడు వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఈనెల 21న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు జెడ్పీటీసీ భాస్కర్ తెలిపారు. మంగళవారం అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విగ్రహ ఏర్పాటు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని కొనియాడారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి విగ్రహ ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజా ప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఎస్సీసెల్ నాయకులు నాగభూషణ, గంగరాజు, ఎస్టీ సెల్ కన్వీనర్ సాకే లక్ష్మీనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


విగ్రహావిష్కరణ పనులు పరిశీలిస్తున్న నాయకులు

ఘనంగా ధనుర్మాస పూజలు

పామిడి: స్థానిక కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆర్య వైశ్యసంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కన్యకా పరమేశ్వరీ మాత ప్రతిమ, మహా విష్ణువు చిత్రపటాన్ని శోభాయానంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేపట్టారు. గోదాదేవి రంగనాథస్వామికి అష్టోత్తర పూజలు చేశారు. అనంతరం భక్తాదులకు తీర్థప్రసాదాలు అందించారు.

వాహనాల పట్టివేత

తాడిపత్రి: మండలంలోని ఆలూరు గ్రామ సమీపంలో పెన్నానది నుండి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న 8 వాహనాలను మంగళవారం పట్టుకున్నట్లు సెబ్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 5 టిప్పర్లు, 1 లారీ, 2 ట్రాక్టర్లను సీజ్ చేశామన్నారు. అనంతరం తదుపరి చర్యల నిమిత్తం వాహనాలను తాడిపత్రి రూరల్ పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఏసు బోధనలు ప్రపంచ శాంతికి మార్గాలు


కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి


సపోస్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

తాడిపత్రిటౌన్: ఏసు బోధనలే ప్రపంచ శాంతికి మార్గాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. పట్టణంలోని ఏఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సపోస్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కే తిరెడ్డి పెద్దారెడ్డి హాజరై మాట్లాడారు. లోకానికి ప్రేమ, శాంతిని పంచిన కరుణామయుని జన్మదినమే క్రిస్మస్ అని అన్నారు. తాడిపత్రిలోని క్రైస్తవ సోదరులు ఒక్క చోట చేరి సపోస్ క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. దైవజనులు జయప్రకాష్, సంపత్ విజయ్‌కుమార్ బైబిల్ సారాంశాన్ని వినిపించారు. పెద్ద ఎత్తున క్రైస్తవులు హాజరయ్యారు. అనంతరం వారికి ప్రేమ విందు ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి జాన్సన్, జిల్లా కార్యదర్శి అనిల్ జాషువా, జాయింట్ సెక్రటరీ జాన్‌కోరేస్, విద్యార్థి విభాగం నేత మనోజ్‌కాళి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

బుక్కరాయసముద్రం: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ గంగాధర్ రావు పేర్కొన్నారు. మంగళవారం జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌లో స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ ఉద్యోగులు మానసిక ఒత్తిడి తగ్గించుకునేందుకు యోగా, వ్యాయామం క్రమ తప్పకుండా చేయాలన్నారు. పోలీసులు శారీరకంగా దృఢంగా ఉండేందుకు స్పోర్ట్స్‌మీట్ ఏటా నిర్వహిస్తున్నామని తెలిపారు. బెటాలియన్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, అందుకు పోలీసు సిబ్బంది సహకరించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, ఎస్కేయూ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రావు, డీఎస్పీలు రమణమూర్తి, దామోదర్, కేఎంవీ ప్రాజెక్ట్ మేనేజర్ ధనుంయరావు, సెంట్రల్ యూనివర్సిటీ సీపీడబ్ల్యూడీ శ్రీనివాసులు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రాము, నాగేంద్ర, లోకేశ్వర నాయుడు, రామారావు, కృష్ణా నాయక్, బెటాలియన్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కమాండెంట్ గంగాధర్ రావు

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోండి

బుక్కరాయసముద్రం: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సునీత ప్రజలకు సూచించారు. మంగళవారం సిద్దరాంపురం, పసులూరులో ఎంపీడీఓ తేజోత్స్న అధ్యక్షతన వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కేంద్రం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. సర్పంచ్‌లు కొండన్న, కల్పన, డాక్టర్ స్వాతి లక్ష్మి, వికసిత్ భారత్ సంకల్ప్ కోఆర్డినేటర్ సాయినాథ్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, ఈఓఆర్డీ దామోదరమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యాడికి: గుడిపాడు, నిట్టూరు పంచాయతీల్లో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఎంపీడీఓ లక్ష్మీనారాయణ ఆయా గ్రామాలో ప్రచార వాహనం ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. గుడిపాడు సర్పంచు దండు సావిత్రి, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు. ఎంఈఓ కాశెప్ప, ఏపీఎం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

ఆసుపత్రి నిర్మాణం త్వరగా పూర్తి చేయండి


కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మంగళవారం ఆయన ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను వేగంగా చేపట్టాలని, త్వరగా రోగులకు అందుబాటులోకి ఆసుపత్రిని తీసుకురావాలని ఆదేశించారు.

ఘనంగా గంగమ్మ, ముత్యాలమ్మ దేవర


దేవరలో పాల్గొన్న ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వీరా

పామిడి: దేవరపల్లి గ్రామంలో మంగళవారం గంగమ్మ, ముత్యాలమ్మ దేవతామూర్తుల దేవరను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులు దేవతా మూర్తులను దర్శించుకుని పూజలు చేయించారు. గ్రామస్తులతో కలిసి సామూహిక భోజనం చేశారు.

ఎద్దుకు శస్త్ర చికిత్స


ఎద్దుతో ఏడీ పద్మనాభం

శింగనమల: స్థానిక పశువైద్యశాలలో బెళుగుప్ప మండలం దుద్దేకుంటకు చెందిన రైతు వెంకటేశు ఎద్దుకు వెటర్నరీ ఏడీ పద్మనాభం మంగళవారం శస్త్ర చికిత్స చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎద్దుకు మూత్రనాళం అవరోధం ఏర్పడిందని, పరీక్షలు చేసి రాళ్లు అడ్డుపడి మూత్రాశయం పగిలిపోయినట్లు గుర్తించామన్నారు. ట్యూబ్ సిస్టోటమీ శస్త్ర చికిత్స చేశామన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

శింగనమల: ఉపాధి హామీ కింద కూలీలకు ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని సీపీఎం నాయకులు కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ ఈశ్వరమ్మకు వినతి పత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ కూలీలకు పనులు లేక వలసలు పోవల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికే వంద రోజులు పని దినాలు అయిన పోయిన వారందరికీ మరో 100 రోజులు పనులు కల్పించాలని కోరారు. నాయకులు రామాంజినేయులు, ఎర్రిస్వామి, వెంకటనారాయణ, అంజినేయులు, జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

నేడు ‘గడప గడపకూ మన ప్రభుత్వం’

గుంతకల్లు రూరల్: నెలగొండ గ్రామంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

రోడ్డు పనుల పరిశీలన

నార్పల: మండల కేంద్రంలోని కూతలేరు వంతెన వద్ద రోడ్డు పనులను ఎంపీపీ నాగేశ్వరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూతలేరు వంతెన శిథిలావవస్థకు చేరి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రత్యేక చొరవ తీసుకొని కూతలేరు వంతెన సమస్యను పరిష్కరించారన్నారు. మాజీ సర్పంచు ఖాదర్‌వలిఖాన్, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ అమీర్, నాయకులు శివయ్య, గోపాల్, పక్కీరెడ్డి, శివయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నేడు పెన్షనర్ల దినోత్సవం

గుంతకల్లు: గుంతకల్లు రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పెన్షనర్ల దినోత్సవం నిర్వహించనున్నారు. ఈమేరకు అసోసియేషన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి వి.సుంకప్ప మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక రైల్వే కోర్టు సమీపంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి డీఆర్ఎం మనీష్‌అగర్వాల్, సీనియర్ డీపీఓ జయశంకర్‌చౌహాన్‌తోపాటు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రీధర్ హాజరవుతున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ఫోర్టు రైల్వేస్టేషన్‌కు తాగునీటి సౌకర్యం


రైల్వేస్టేషన్‌కు పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి ఫోర్టు రైల్వే స్టేషన్‌కు మంగళవారం ఐఓడబ్ల్యూ అధికారి నాగేశ్వర నాయక్ తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయించారు. సత్యసాయి వాటర్ మేనేజ్‌మెంట్ తో మాట్లాడి ఫోర్టు రైల్వే స్టేషన్‌కు తాగునీటి సదుపాయాన్ని కల్పించారు. రైల్వే ప్రయాణికులు ఐఓడబ్ల్యూ అధికారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ద్విచక్ర వాహనాల్లో పెట్రోల్ మాయం

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో తరుచూ ద్విచక్ర వాహనాల్లోని పెట్రోల్‌ను దొంగలు చోరీ చేసుకెళుతున్నారు. ఇళ్ల ముందు పార్కింగ్ చేసి ఉంచిన బైక్‌ల్లోని ఇంధనాన్ని మాయం చేస్తున్నారు. ఆనంద్ అనే వ్యక్తికి చెందిన బైక్ నుంచి వారం రోజుల్లో మూడు సార్లు ఎత్తుకెళ్లారు. ఆనంద్‌తో పాటు మరో ఐదు మందికి చెందిన ద్విచక్ర వాహనాల్లో పెట్రోల్‌ను ఎత్తుకెళ్లినట్లు బాధితులు వాపోతున్నారు.

కందిలో పంటకోత ప్రయోగం


కనంపల్లి వద్ద పంట కోత ప్రయోగం చేస్తున్న దృశ్యం

గార్లదిన్నె: కనంపల్లిలో మంగళవారం ఖరీఫ్ కింద రైతులు సాగు చేసిన కంది పంటలో పంట కోత ప్రయోగాలు చేశారు. ఈసందర్భంగా ఏఓ సోమశేఖర్ పేర్కొన్నారు మాట్లాడుతూ 179–1 సర్వే నంబర్‌లో పంట కోత ప్రయోగం చేయగా ఒక క్వింటాల్ దిగుబడి వచ్చిందన్నారు. సాధారణంగా ఒక ఎకరాలో 3 నుంచి 4 క్వింటాళ్ల రావాల్సి ఉండగా వర్షభావంతో తక్కువ దిగుబడి వచ్చిందన్నారు. కార్యక్రమంలో వీఏఏ శాంతి, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు ప్రభుత్వ మేలును గుర్తించాలి

బుక్కరాయసముద్రం: అంగన్‌వాడీ కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వం వారి కోసం చేసిన మేలును గుర్తించాలని జెడ్పీటీసీ భాస్కర్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. 14 ఏళ్ల సీఎంగా ఉన్న చంద్రబాబు వేతనాలు సక్రమంగా ఇచ్చేవారు కాదన్నారు. జగనన్న ప్రభుత్వంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.7 వేలు ఉన్న జీతాన్ని 11,500, పెంచారన్నారు. హెల్పర్లకు రూ.4,500 నుంచి 7 వేలుకు పెంచారని గుర్తు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల ప్రారంభం


పెద్దవడుగూరు లో అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరుస్తున్న అధికారులు

పెద్దవడుగూరు: మండలవ్యాప్తంగా సుమారుగా 20 అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభించినట్లు సీడీపీఓ షాజీదాబేగం తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఎనిమిది రోజులుగా సమ్మె చేస్తుండటంతో గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల ద్వారా పౌష్టికాహారం అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా పెద్దవడుగూరు లో 6, మిడుతూరు 1, కాశేపల్లిలో 2, గుత్తిఅనంతపురంలో 1, ఆవులాంపల్లి, విరుపాపురం గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచినట్లు సీడీపీఓ తెలిపారు. లబ్ధిదారులందరికీ పౌష్టికాహారం అందించడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమద్ వ్రతం


హనుమద్ వ్రతం నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో వెలసిన రామస్వామి దేవాలయంలో మంగళవారం హనుమద్ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. కసాపురం వేద పాఠశాల గురువు వేదం స్వామి ఆధ్వర్యంలో వ్రతం నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి వ్రతాన్ని వీక్షించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగం చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రసాద్, చక్రి, రమేష్, శీనా, వెంకట్, శేషు, బాచి తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి ఎమ్మెల్యే ఆర్థికసాయం


బోయరాజుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన బోయరాజు అనే యువకుడి వ్యాపార నిమిత్తం ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. మంగళవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి తన ఇబ్బందులను తెలియజేసిన రాజుకు ఎమ్మెల్యే చేయూతనందించి అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైవీఆర్‌కు రాజు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న 10వ వార్డుకు చెందిన నజీర్ వైద్యఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద మెరుగైన వైద్యసేవలు పొందాలని ఎమ్మెల్యే సూచించారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి


డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ ఎన్.భవాని

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలో పేదలు ఆర్థికంగా ప్రగతి సాధించాలన్నా, రాష్ట్రాభివృద్ధి జరగాలన్నా మళ్లీ వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని తెలిపారు. మంగళవారం పట్టణంలోని 33వ వార్డు కౌన్సిలర్ విద్యారాణి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. సచివాలయం బయట పార్టీ జెండాను ఆమె ఎగురవేసి వందనం చేశారు. సచివాలయం పరిధిలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆమె ఆవిష్కరించారు. సభనుద్దేశించి ఆమె మాట్లాడుతూ జగనన్న పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. జేసీఎస్ కన్వీనర్ ఖలీల్, వార్డు నాయకులు జయరామ్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

గార్లదిన్నె: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీన వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు.

పామిడి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది మంగళవారం గుత్తి బీసీసీరోడ్డుపై నిరసన తెలిపారు. సీపీఎం సీనియర్ నాయకులు పీ అనిమిరెడ్డి వారికి మద్దతు తెలిపారు.

వృద్ధులకు కంటి పరీక్షలు

నార్పల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 36 మందిని కంటి ఆపరేషన్ల కోసం కడపకు తీసుకెళ్లనున్నట్లు వైఎస్సార్‌సీపీ నేత, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఎంపీపీ నాగేశ్వరావు, డాక్టర్ ప్రవీణ్, గోపాల్, మోహన్, శివ తదితరులు పాల్గొన్నారు.